భక్తిశ్రద్ధలతో మొహర్రం

త్యాగానికి ప్రతీకగా, రంజాన్ తర్వాత ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే మొహర్రంను శనివారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీధుల్లో సవార్లను ఊరేగించారు. కులమతాలకు అతీతంగా వేడుకల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్మల్ పంజేష గల్లీలో ప్రతిష్ఠించిన పీరీలను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దర్శించుకున్నారు.

- వివరాలు 9లో▸



కదిలిస్తే కన్నీళ్లే..

'ఇలేగాం గ్రామానికి చెందిన బుట్టు రుక్మాబాయి భర్త విఠల్ పదేళ్ల క్రితమే మృతిచెందాడు. తనకున్న మూడు ఎకరాల పొలంలో పంటలు పండిస్తూ తన ముగ్గురు పిల్లలను పోషిస్తోంది. ప్రస్తుతం కొడుకు గణేశ్ వ్యవసాయం చేస్తున్నాడు. ఏటా సోయా, పత్తి పంటలు వేసేవాడు. ఈయేడు కూడా మూడెకరాల్లో పత్తిపంట వేశాడు. మొలకలు బాగానే వచ్చాయి. ఇటీవలే కూలీలతో కలుపు తీయించి కాంప్లెక్స్ ఎరువులు వేశాడు. మూడు రోజుల క్రితం ఇలేగాం చెరువు తెగడంతో పంట మొత్తం తుడిచిపెట్టుకు పోయింది. భూమి కూడా ఎక్కడ ఉందో గుర్తించకుండా రాళ్లు, మట్టి చేలల్లో మేటలు వేసింది' ఇది ఒక గణేశ్ సమస్యే కాదు.. సిరాల ప్రాజెక్టు, ఇలేగాం చెరువు ఆయకట్టు భూములన్నీ హద్దులు చెరిగిపోయి.. బండరాళ్లు, మట్టి గుట్టలతో దర్శనమిస్తున్నాయి.

- సిరాల, ఇలేగాం గండ్లతో తుడిచిపెట్టుకుపోయిన పంటలు
- వాగులు, ఒర్రెలను తలపిస్తున్న పంటచేలు
- ఎటుచూసినా బండరాళ్లు, మట్టి దిబ్బలే
- హద్దులు చెరిగి.. గుట్టలుగా మారిన సాగు భూములు



పంట పొలాల్లోకి చేరిన బండరాళ్లు, ఇసుక మేటలు

భైంసా/భైంసారూరల్: సిరాల నుంచి ఇలేగాం వరకు సీసీ కెనాల్‌కు ఇరువైపుల పచ్చని పంట పొలాలు.. కాలువలో పారే నీటి సవ్వడితో వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉండేది. కొత్తవారు ఓ గంటపాటు ఇక్కడే సేదదీరి పోయేవారు. సిరాల గుట్ట నుంచి ఇలేగాం వరకు యేటా పచ్చని పంటలు కనిపించేవి. సిరాల ప్రాజెక్టు ఎప్పుడూ ఎండిపోయేదికాదు. మూడు తరాలుగా ఇలేగాం, సిరాల గ్రామాల రైతులకు జీవనాధారంగా మారింది. నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షం మూడు గంటల్లోనే ఇలాంటి దృశ్యాలను కనుమరుగు చేసింది. ఇప్పుడు అక్కడన్నీ బండరాళ్లే. పొలాలకు హద్దులు కూడా చెరిగిపోయాయి. ఏ రైతు కూడా తన పొలం ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఉందో చెప్పలేని దుస్థితి. మొన్నటి వరకు పత్తి, సోయా, వరి పంటలతో ఉన్న భూములు ఇప్పుడు బండరాళ్లు, ఇసుక మేటలతో గుట్టలను తలపిస్తున్నాయి. ఎనిమిది అడుగుల మేర ఇసుక మేటలే కనిపిస్తున్నాయి.

నదిని తలపిస్తున్న పొలాలు..

నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షానికి సిరాల ప్రాజెక్టు, ఇలేగాం చెరువుకు గండ్లు పడ్డాయి. దీంతో వాటికింద ఉన్న పంట భూములు నామరూపాల్లేకుండా పోయాయి. ప్రస్తుతం వరద తగ్గడంతో అక్కడికి వెళ్లి చూస్తే అక్కడ ఏదో నది ఉన్నట్లు అనిపిస్తుంది.

ఇలేగాంలో ఎక్కువ నష్టం..

ఇలేగాం గ్రామంలో ఈ నష్టం రెట్టింపయింది. ఒక వైపు సిరాల ప్రాజెక్టు నీరు.. మరోవైపు ఇలేగాం చెరువు నీరు... మహానదిని తలపించేలా పంటలను ముంచెత్తింది. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో వినియోగించిన బండరాళ్లు, మొరం 450 ఎకరాల్లో మేటలు వేసింది. వరద తగ్గడంతో చేల వద్దకు వస్తున్న రైతులు జరిగిన నష్టాన్ని చూసి కన్నీటిపర్యంతమవుతున్నారు. తమ పొలం ఎక్కడుందో గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కాళ్లు మొక్కుతున్న మహిళా రైతు

సర్వే నిర్వహిస్తున్నాం

భైంసా మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన భూముల వివరాలు సేకరిస్తున్నాం. సిరాల, ఇలేగాం గ్రామాల్లో అత్యధికంగా భూములకు నష్టం జరిగింది. రెండు గ్రామాల్లోనూ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సర్వే నిర్వహిస్తాం. సిరాల ప్రాజెక్టు, ఇలేగాం చెరువు తెగిపోవడంతో పంటపొలాల పరిస్థితి ఇలా మారింది.

– చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్

పూడ్చలేని నష్టం...

సిరాల, ఇలేగాం గ్రామాల్లో ఎకరం భూమి రూ.30 లక్షలు పలుకుతుంది. బంగారం పండే భూములన్నీ ప్రస్తుతం బండరాళ్లతో నిండిపోయాయి. ఎటుచూసిన నీరే కనిపిస్తుంది. ఈ నష్టం పూడ్చే పరిస్థితి కనిపించడంలేదు. భూమినే నమ్ముకుని బతుకుతున్న రైతు కుటుంబాలన్నీ రోడ్డునపడ్డాయి. గ్రామంలో ఏ రైతును కదిలించినా ఉబికి వస్తున్న కన్నీరే.. భూమి చదునుచేసేందుకు రైతులకు ఎకరాకు రూ.2 లక్షల వరకు వెచ్చించాల్సి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఊహించని విధంగా వచ్చిన విపత్తు నుంచి తమను గట్టెక్కించాలని రైతులు కోరుతున్నారు.

అధైర్యపడకండి.. ఆదుకుంటాం



సిరాల ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్



ఇలేగాంలో పొలాలను పరిశీలిస్తున్న విఠల్‌రెడ్డి

- సిరాల, ఇలేగాం ముంపు బాధితులకు మంత్రి భరోసా..

భైంసారూరల్: సిరాల ప్రాజెక్టు తెగి నీటమునిగిన పంటలు, ఇలేగాం చెరువు తెగి జరిగిన నష్టాన్ని శనివారం పలువురు పరిశీలించారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి బాధిత గ్రామాలకు వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిలతో కలిసి సిరాల ప్రాజెక్టు వద్దకువెళ్లారు. భారీగా వరదనీరు చేరడంతో కొట్టుకుపోయిన కట్ట, అక్కడి ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. భారీ వరదనీటితో పొలాలు వాగులా కనిపిస్తున్నాయని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. బాధితులకు అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

పంటపొలాల్లో తిరిగి...

ఇలేగాం వెళ్లిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి రైతులతో కలిసి పంట పొలాల్లో తిరిగారు. బాధిత రైతులగోడు విన్నారు. తెగిపోయిన ఇలేగాం చెరువు కట్ట, అలుగు భాగం పరిశీలించారు. పంట పొలాల్లో మేటవేసిన రాళ్లు, ఇసుకను చూశారు. హనుమాన్ ఆలయం వద్ద కొట్టుకుపోయిన రోడ్డు, పొలాల పరిస్థితిని చూశారు. గ్రామస్తులంతా తమకు న్యాయంచేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. రైతులకు పంటపరిహారంతోపాటు భూమి చదునుకోసం ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించాలని కోరారు. వరదనీటిలో కొట్టుకుపోయిన 20 ట్రాన్స్‌ఫార్మర్లు, 110 విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయిస్తేనే మిగిలి ఉన్న రైతుల పంటలు పండుతాయని రైతులు విన్నవించారు. అనంతరం ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి ఇలేగాం గ్రామానికి వచ్చి తెగిన చెరువుకట్ట వద్దకు వచ్చారు. అక్కడే ఉన్న భూముల్లో బండరాళ్లను చూసి బాధిత రైతులను ఓదార్చారు.

ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

- టీఎస్ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి



అర్లి వంతెనను పరిశీలిస్తున్న వేణుగోపాలాచారి

భైంసాటౌన్/లోకేశ్వరం: భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు వరదనీటితో ఏటా ఏర్పడుతున్న ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని టీఎస్ఐడీసీ చైర్మన్ ఎస్.వేణుగోపాలాచారి అన్నారు. భైంసాలోని వరద ప్రభావిత ఆటోనగర్‌ను సందర్శించారు. ఎంఐఎం నాయకుడు ఫైజుల్లా ఖాన్‌తోపాటు కాలనీవాసులు కష్టాలను ఆయన దృష్టికి తెచ్చారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు వరదనీటితో దిగువన కాలనీల్లోకి నీరు రాకుండా అవసరమైన చర్యలు చేపడతామన్నారు. అనంతరం లోకేశ్వరం మండలంలోని పుస్పూర్, బిలోలి, సాథ్‌గాం, హద్‌గాం గ్రామాల్లో వరదలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అర్లి వంతెన మరమ్మతుకు నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. ఆయన వెంట జెడ్పీ మాజీ చైర్మన్, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబు, నాయకులు భీంరావు, రమేశ్, పండిత్‌రావు, సర్పారెడ్డి, శంకర్‌గౌడ్, విజయ్‌రావు ఉన్నారు.

పులులతోనే జీవ వైవిధ్యం

- పులుల సంరక్షణ మనందరి బాధ్యత



ఖానాపూర్‌లో అటవీశాఖ అధికారుల ర్యాలీ..

కడెం/ఖానాపూర్: పులులతోనే జీవ వైవిధ్యం, వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుందని ఎఫ్ఆర్వోలు వినాయక్, అనిత అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఖానాపూర్, కడెంలో ర్యాలీ తీశారు. కల్లెడ గ్రామంలో డబ్ల్యూసీఎస్ ఇండియా రిప్రజెంటేటివ్ నగందుల వెంకట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవ్ ద టైగర్ సేవ్ ద నేషన్ అని నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. అడవుల సమతుల్యతతోనే పులుల సంరక్షణ సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ అడవులను సంరక్షించాలన్నారు. పులుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వోలు ప్రకాశ్, సిద్ధార్థ, ఎఫ్‌బీవో అలీం, అధికారులు సాంబయ్య, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మంత్రిని కలిసిన అదనపు కలెక్టర్, ఆర్డీవో




మంత్రికి పూల మొక్క ఇస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌టౌన్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన అదనపు కలెక్టర్ ఎల్.కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి శనివారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి పూల మొక్క అందజేశారు. మంత్రి వారికి అభినందనలు తెలిపారు.

మున్నూరుకాపు ఉద్యోగులు..

మున్నూరుకాపు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కూడా మంత్రి ఐకేరెడ్డిని శనివారం క్యాంపు కార్యాలయంలో కలిశారు. పూల మొక్క అందజేసి శాలువాతో సత్కరించారు. ఇందులో అధ్యక్షుడు గంగాధర్, సభ్యులు నరేంద్రబాబు, జుట్టు గజేందర్, భోనగిరి సుజయ్, ప్రవీణ్‌కుమార్, అశోక్, శ్రీనివాస్, అరవింద్ తదితరులు ఉన్నారు.

సహాయ చర్యలకు సిద్ధంగా ఉండాలి



ఎయిర్‌బోట్‌పై ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్

భైంసాటౌన్: వరదల్లో చిక్కుకున్నవారిని రక్షించేందుకు, సహాయ చర్యలకు సిద్ధంగా ఉండాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ పోలీసులకు సూచించారు. భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులో ఎయిర్‌బోట్స్ వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. విపత్తు సమయాల్లో ప్రజలకు అవసరమైన సహాయక చర్యలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు

ఆర్టీసీని కాపాడుకోవాలి

నిర్మల్‌ఖిల్లా: ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏఐటీయూసీ నాయకులు విలాస్ అన్నారు. నిర్మల్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఐ–ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తోందన్నారు. దీనిపై పోరాడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్.రెడ్డి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య పాల్గొన్నారు.

ప్రకృతికి తలవంచాల్సిందే!



కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అధికారులు

- వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

సారంగపూర్/సోన్: ప్రకృతి ప్రకోపానికి అందరూ తలవంచాల్సిందే అని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న సారంగాపూర్, సోన్ మండలాల్లోని పలు గ్రామాలను శనివారం పరిశీలించారు. సారంగాపూర్ మండలం కంకెట, వంజర్, మలక్‌చించోలి, వైకుంఠాపూర్ గ్రామాల్లో, సోన్ మండలం జాఫ్రపూర్, మాదాపూర్ గ్రామాల్లో పర్యటించారు. వరదతాకిడికి దెబ్బతిన్న రోడ్లు, పంటలను కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. దోనిగాం ప్రాజెక్టు వద్దకు వెళ్లి అక్కడి పరిస్థితి గురించి ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్వర్ణ ప్రాజెక్టు పరిస్థితి గురించి ఈఈ రామారావును అడిగి తెలుసుకున్నారు. రెండోగేటు మ్యానువల్‌గా లేచిందని, దానికి మరమ్మతులు చేయించాలని సూచించారు. జాఫ్రపూర్, మాదాపూర్ గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ స్వర్ణ ప్రాజెక్టు ఆరు వరదగేట్లు పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో నది పరీవాహక ప్రాంతంలోని పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంటనష్టం సర్వే చేయాలని వ్యవసాయాధికారులకు సూచించారు. దెబ్బతిన్న రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ డీఈ తుక్కారాంను ఆదేశించారు. మిషన్ భగీరథ పైపులైన్‌లు దెబ్బతిన్న ప్రదేశాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని సూపర్‌వైజర్ నారాయణను ఆదేశించారు. ఇంకా వర్షాలు ఉన్నందున స్వర్ణ పరీవాహక ప్రాంత రైతులు, పశువుల పెంపకందారులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మాదాపూర్ వంతెన పనులు ఆలస్యమయ్యాయని తెలిపారు. త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. పంటలను వరదల నుంచి కాపాడేందుకు బాక్స్ కల్వర్టులు నిర్మించాలని సూచించారు. మంత్రి వెంట ఆర్డీవో రత్న కళ్యాణి, డీఎస్పీ గంగారెడ్డి, సీఐ నవీన్‌కుమార్, తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, విద్యుత్ ఏఈ శ్రీనివాస్, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ అధ్యక్షురాలు ఆశ్రితరెడ్డి, జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, నాయకులు అయిటి చందు, నారాయణరెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌మహ్మద్, మోహినొద్దీన్, ఆర్అండ్‌బీ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో మాట్లడుతున్న అదనపు కలెక్టర్

కడెం: భారీ వర్షాలు ఉన్నప్పుడు ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఫ్లడ్స్ ప్రత్యేక అధికారి ముషరఫ్ అలీ సూచించారు. కడెం ప్రాజెక్టును శనివారం సందర్శించారు. వరద గేట్లను పరిశీలించి ఇరిగేషన్ అధికారులకు సూచనలు చేశారు. అలాగే అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ కూడా కడెం ప్రాజెక్టును సందర్శించారు. దెబ్బతిన్న ఎడమ కాలువ ప్రాంతాన్ని పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ చిన్నయ్య, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కడెంకు తగ్గిన ఇన్‌ఫ్లో

కడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. శనివారం 6,171 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో రెండు గేట్ల ద్వారా 2,476 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 685.050 అడుగులు ఉంది. కడెం ఎడమ కాలువకు 100 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

రైతులకు అండగా ఉంటాం

- ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి



దెబ్బతిన్న పత్తి మొక్కలను పరిశీలిస్తున్న ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి

కుంటాల: రైతులకు అండగా ఉంటామని ఐడీసీ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి భరోసా ఇచ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కల్లూర్, వెంకూర్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను శనివారం పరిశీలించారు. అనంతరం కుంటాలలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ తక్షణ స్పందనతో కొన్ని జిల్లాల్లో పెద్ద ప్రమాదం నుంచి ప్రజలు బయటపడ్డారని తెలిపారు. గతంలో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేలు చొప్పున పరి హారం ఇచ్చామన్నారు. నష్టపోయిన పంటలకు పరిహారం అందించడంతోపాటు ఇళ్లు కూలిపోయిన వారిని ఆదుకునేలా చర్యలు చేపడతామని వివరించారు. ఆయన వెంట నాయకులు సాప్లీ రమేశ్, సోలంకి భీంరావు, జీవీ.రమణారావు, పండిత్ పటేల్, ధర్మాగౌడ్, కొట్టె హన్మాండ్లు, దేవేందర్, మగ్గిడి దిగంబర్, శివాజీపటేల్, లింగారావు, రాములు, సాయినాథ్, పండరి, యోగేశ్ ఉన్నారు.

సదర్మాట్‌కు కొనసాగుతున్న వరద



ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్ ఆనకట్టకు, గోదావరి ప్రాంతాలకు వరద ఉధృతి కొనసాగుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకుతోడు ఎస్సారెస్పీ గేట్లు ఎత్తడంతో భారీగా వరద వస్తోంది. సదర్మాట్ గరిష్ఠ నీటిమట్టం 7.6 ఫీట్లు కాగా, ప్రస్తుతం 10.6 ఫీట్లలో వరద కొనసాగుతోంది. దిగువన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

వరద నష్టంపై మంత్రి సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో జరిగిన నష్టంపై నివేదిక ఇవ్వాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోన్ మండలం జాఫ్రాపూర్, మాదాపూర్, సారంగాపూర్ మండలం చించోలి, వంజరి, కాంకెట, భైంసా మండలంలోని సిరాల గ్రామాల్లో శనివారం పర్యటించారు. సాయంత్రం సమీకృత కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్లు, వంతెనలు, చెరువులు, పంట నష్టం, విద్యుత్, తాగునీరు పంపులకు జరిగిన నష్టంపై నివేదిక రూపొందించాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

బండి సంజయ్ నియామకం హర్షణీయం

ఆదిలాబాద్: కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌ని జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై ఎంపీ సోయం బాపూరావు హర్షం వ్యక్తం చేశారు. సామాన్య కార్పొరేటర్ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడంలో సంజయ్ విశేషంగా కృషి చేశారన్నారు. కష్టపడే నాయకులకు బీజేపీలో సముచిత స్థానం ఉంటుందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో ఇటు రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

కేయూ పరీక్షలు వాయిదా

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈ నెల 30, 31, ఆగస్టు 1, 2వ తేదీల్లో నిర్వహించనున్న వివిధ పరీక్షలను వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ, ఫార్మడీ, బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ సెమిస్టర్ పరీక్షల వివిధ పేపర్లు, పీజీ కోర్సులకు నాలుగో సెమిస్టర్ ప్రాక్టికల్స్ పరీక్షలు, లా ఫైనల్ విద్యార్థులకు మూట్ కోర్టు పరీక్షలు వాయిదా వేసినట్లు వివరించారు. వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పరీక్షలను వాయిదా వేశామని పేర్కొన్నారు. వాయిదాపడిన పరీక్షలను తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

బాలింతకు తప్పని దారి కష్టాలు



తాత్కాలిక వంతెనపై పసిపాపతో బాలింత

ఇచ్చోడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు కొట్టుకుపోయాయి. శనివారం మండలంలోని జల్దా గ్రామానికి చెందిన బాలింత పసిపాపను తీసుకొని ఆస్పత్రికి ఇచ్చోడ మండల కేంద్రానికి వచ్చింది. సిరిచెల్మ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో ప్రమాదకారంగా ఉన్న రోడ్డు నుంచి పసిపాపతో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది.

గ్రామాల్లో ఎంపీ పర్యటన



వంతెనను పరిశీలిస్తున్న ఎంపీ బాపూరావ్

ఇంద్రవెల్లి: మండలంలోని వడగామ్, పాటగూడ, హీరాపూర్ గ్రామాల్లో శనివారం జిల్లా ఎంపీ సోయం బాపురావ్ పర్యటించారు. భారీ వర్షంతో వరదనీటి కారణంగా కోతకు గురైన పాటగూడ వంతెన, గ్రామాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కోతకు గురైన రోడ్లు, కల్వర్టు మరమ్మతులు చేయించి ప్రజలకు రోడ్డు సమస్య లేకుండా చూడాలన్నారు. పాటగూడ వంతెన మరమ్మతులకు ఎంపీ నిధుల నుంచి రూ.3లక్షల నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి ముత్నూర్ గ్రామాన్ని సందర్శించి ఆదివాసీ పెద్దలతో చర్చించారు. అధికారులతో మాట్లాడి కోతకు గురైన రోడ్లు, కల్వర్టులకు మరమ్మతులు చేయించాలని సూచించారు.

రుయ్యాడిలో భక్తజనసందోహం

- ముగిసిన మొహర్రం వేడుకలు
- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకూ పూజలు



పూజలు చేస్తున్న ఆదిలాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ రంగినేని మనిషా దంపతులు



డప్పు వాయిస్తున్న దేవస్థాన కమిటీ అధ్యక్షుడు లోక భూమారెడ్డి

తలమడుగు: రాష్ట్రంలో మొహర్రం ఉత్సవాలకు ప్రసిద్ధిగాంచిన రుయ్యాడిలో శనివారం సంబురాలు ముగిశాయి. ముగింపు సందర్భంగా వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. హస్సేన్ హుస్సేన్ సవార్లను (పీరీలను) దర్శించుకుని పూజలు చేస్తే అనుకున్న కోరికలు నెరవేరుతాయని ఇక్కడికి వచ్చే భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి సైతం తరలివచ్చి పూజలు చేశారు. చివరి రోజు కావడంతో భక్తులతో హస్సేన్ హుస్సేన్ దేవస్థానం కిటకిటలాడింది. గురువారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకూ మొహర్రం వేడుకలు నిర్వహించారు. దేవస్థానంలో మాజీ ఎంపీ గోడం నగేశ్, ఆదిలాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ రంగినేని మనిషా పవన్ రావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లోక భూమారెడ్డి డప్పు వాయిస్తూ గ్రామంలో ఊరేగింపులో పాల్గొన్నారు.



భక్తుల మధ్య పీరీలను ఆడిస్తున్న దృశ్యం

వివిధ వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి.

భక్తులకు ఇక్కట్లు కలుగకుండా ఏర్పాట్లు..

మొహర్రం వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హస్సేన్ హుస్సేన్ దేవస్థానం ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం, వాహనాల పార్కింగ్, అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ అన్నదానం నిర్వహించారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై ధనశ్రీ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవస్థాన కమిటీ చైర్మన్ లోక భూమారెడ్డి, జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



పీరీలు ఊరేగింపులో భక్తులు

పర్యావరణ హితం కోసం..

నిర్మల్‌ఖిల్లా: పర్యావరణాన్ని కాపాడుదామని చాలామంది చెబుతుంటారు... కొంతమందే పాటిస్తుంటారు. కానీ పర్యావరణహితం కోసం నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన తాన్న లక్ష్మి డీఆర్డీవో సాంకేతిక సహకారంతో తయారైన బయోడీగ్రెబుల్ ప్లాస్టిక్ రహిత చేతి సంచులను ప్రజల్లోకి తీసుకెళ్తూ చైతన్యవంతుల్ని చేస్తోంది. ఈ అంశంపై సాక్షి ప్రత్యేక కథనం...

- నిర్మల్‌లో నేలలో కరిగిపోయే సేంద్రియ చేతిసంచుల విక్రయ కేంద్రం
- డీఆర్డీవో సాంకేతిక సహకారంతో ఏర్పాటు..
- ప్రజల్ని చైతన్యం చేయడమే ధ్యేయమంటున్న నిర్వాహకురాలు
- రాష్ట్ర మంత్రి, ప్రభుత్వాధికారుల సహకారంతో ముందుకు..



సేంద్రియ చేతిసంచులు

పర్యావరణ పరిరక్షణ కోసం...

నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన తాన్న లక్ష్మి పర్యావరణానికి హాని చేకూర్చని చేతి, క్యారీ బ్యాగులను తయారు చేస్తూ ప్రజల్లోకి తీసుకెళ్తోంది. దీన్ని లాభసాటి వ్యాపారంగా కాకుండా ప్రజల్ని చైతన్యవంతం చేసే కార్యక్రమంగా ముందుకు సాగుతోంది. జిల్లా కేంద్రంలో అవుట్‌లెట్ విక్రయ కేంద్రాన్ని ప్రారంభించింది. దీనికి రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రోత్సాహం కూడా తోడు కావడంతో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌లను కలిసి ప్లాస్టిక్‌తో పర్యావరణానికి కలిగే నష్టాలను వివరిస్తూనే ఈ బయోడిగ్రేడెబుల్ క్యారీ బ్యాగులు, చేతి సంచుల విక్రయం కోసం జిల్లా కేంద్రంలోని దివ్యనగర్ ప్రాంతంలో ఆథరైజ్డ్ ఫ్రాంచైజీని నెలకొల్పింది.



ప్లాస్టిక్ ద్వారా కాలుష్యం ఇలా...

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా...

నిత్యజీవితంలో ప్లాస్టిక్ భాగమైంది. ప్లాస్టిక్‌తో నేల, నీరు కలుషితమవుతోంది. ప్రాణాంతకమైన క్యాన్సర్ వంటి రోగాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో డీఆర్డీవో శాస్త్రవేత్త వీరబ్రహ్మం ప్రత్యేక కృషితో బయోడీగ్రేడబుల్ ప్లాస్టిక్ రహిత ముడి పదార్థాలను ఉపయోగించి చేతిసంచులను, క్యారీ బ్యాగులను తయారు చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో వీటి తయారీని చేపడుతున్నారు. ఈ బయోడిగ్రేడబుల్ క్యారీ బ్యాగులు కేవలం 30రోజుల లోపే భూమిలో కరిగిపోతాయి.

ఈ సేంద్రియ చేతి బ్యాగుల ప్రత్యేకతలు ఇవీ...

- ఈ సేంద్రియ ముడి పదార్థాలతో తయారైన చేతి సంచులు అతి త్వరగా నేలలో కలిసిపోయి సేంద్రియ ఎరువుగా మారిపోతాయి.
- మొక్కజొన్నలు, కూరగాయల పిండి, గుజ్జు తదితర ముడి పదార్థాలతో ఈ చేతి సంచి బ్యాగులను తయారు చేస్తున్నారు.
- వీటిని వాడి పారవేసిన 30రోజుల్లో మట్టిలో కరిగిపోయి ఎరువుగా మారిపోతాయి.
- ఈ బ్యాగులను పూర్తిగా కాల్చినట్లయితే బూడిదగా మారిపోతుంది. ఎటువంటి విష వాయువులను విడుదల చేయవు.
- ఈ బ్యాగులను పొరపాటున మూగజీవాలు తిన్నా ఎటువంటి సమస్యలు రావు. జీర్ణం అయిపోతాయి.
- ఈ బ్యాగులు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులలో ఉండే బిస్ఫినాల్ -ఏ అనే విషపూరిత రసాయనం ఉండదు.
- ఈ బ్యాగులను వాడిన తర్వాత సేకరించి మళ్లీ రీసైకిల్ చేయాల్సిన అవసరం లేదు.

ఆలోచన మొదలైంది ఇలా...



సేంద్రియ కవర్లు

హైదరాబాద్ కేంద్రంగా గల డీఆర్డీవో (భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ) శాస్త్రవేత్త కె.వీరబ్రహ్మం తన ప్రత్యేక ఆలోచనతో మొక్కజొన్నల గుజ్జు, కూరగాయల పిండి తదితర ముడిసరుకులతో ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా కొత్త బ్యాగులను రూపొందించే ప్రక్రియను చేపట్టారు. వీరి ఇంటర్వ్యూ వివరాలను టీవీలో చూసిన జిల్లా కేంద్రానికి చెందిన లక్ష్మి ప్రత్యేకంగా వారిని కలిసి దానికి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకుంది. హైదరాబాద్‌లోని ఈ చేతి సంచుల తయారీ కేంద్రాన్ని సందర్శించి వారి సహకారంతో నిర్మల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసింది.



విక్రయకేంద్రంలో నిర్వాహకురాలు లక్ష్మి

ఇంటర్వ్యూ చూసి స్ఫూర్తిని పొందాను...

రెండేళ్ల క్రితం పర్యావరణహితమైన ప్లాస్టిక్ రహిత క్యారీ బ్యాగుల గురించి వివరిస్తున్న డీఆర్‌డీవో శాస్త్రవేత్త కె.వీరబ్రహ్మం ఇంటర్వ్యూ టెలివిజన్‌లో చూశాను. వెంటనే హైదరాబాద్ వెళ్లి వారిని కలిశాను. హైదరాబాద్ యూనిట్ కేంద్రంగా తయారవుతున్న ప్లాస్టిక్ రహిత చేతి సంచులను తయారు చేస్తున్న కేంద్రానికి వెళ్లి పరిశీలించాను. వారి సహకారంతో పంపిణీదారుగా నిర్మల్ జిల్లా కేంద్రంలో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశాను.

– తాన్న లక్ష్మి,
విక్రయ కేంద్రం నిర్వాహకురాలు, నిర్మల్

ఆపన్నహస్త కోసం ఎదురుచూపు

- గొంతు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న యువకుడు
- ఆపరేషన్‌కు రూ.5లక్షలు అవుతాయన్న వైద్యులు
- వైద్యానికి డబ్బులు లేక విలవిలలాడుతున్న తల్లిదండ్రులు
- కొడుకును కాపాడాలని వేడుకుంటున్న తల్లిదండ్రులు



హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రఘు

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి కే గ్రామానికి చెందిన గుండం భీమన్న–లక్ష్మి దంపతులది నిరుపేద కుటుంబం. రెక్కాడితే గాని డొక్కనిండని పరిస్థితి. నిత్యం కూలీ పనులకు వెళ్తేనే పూట గడిచేది. ఆ దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో పెద్ద కుమారుడు రఘు (19) గ్రామంలో గొర్రెల కాపరిగా పనిచేస్తూ తల్లిదండ్రులకు చేదోడు వాడుగా నిలుస్తున్నాడు. ఇటీవల రఘు గొంతులో నొప్పిగా ఉందని చెప్పడంతో తల్లిదండ్రులు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చూపించారు. పరీక్షించిన వైద్యులు గొంతులో గడ్డలు తయారయ్యాయని, ఆపరేషన్ చేయించాలని, ఇందుకు హైదరాబాద్ వెళ్లాలని తెలిపారు. దీంతో ఆ నిరుపేద దంపతులు అప్పుచేసి రూ.50వేలతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు ఆపరేషన్‌కు రూ.5లక్షలు అవసరం అవుతాయని తెలుపడంతో ఆ నిరుపేద తల్లిదండ్రులు ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. ఎవరైనా దాతలు స్పందించి తమ కొడుకును కాపాడాలని వేడుకుంటున్నారు.

స్పందించాల్సిన దాతలు...
ఫోన్ పే, గుగూల్ పే 8125306585

కుంటాల దారిలో... బండరాళ్లు

నేరడిగొండ: ఇటీవల కురుస్తున్న వర్షాలతో అటవీ ప్రాంతంలో గుట్ట అంచున ఉండే వృక్షాలు, బండరాళ్లు జారి రోడ్డుపై పడుతున్నాయి. మండలంలోని కుంటాల జలపాతానికి వెళ్లే మార్గంలో కుంటాల(కె) గ్రామ సమీపంలోని ఘాట్ వద్ద బండరాళ్లు, వేర్లతో సహా చెట్లు రోడ్డుపై వచ్చిపడ్డాయి. ఈ రోడ్డులో పర్యాటకులు జలపాతానికి వెళ్లాల్సి ఉంటుంది. దీంతోపాటు ఆ దారిగుండా కుంటాల(బి), వెంకటాపూర్, మాట్లొద్ది, నాగమల్యాల్, గోవింద్‌పూర్, పీచర, లక్ష్మీపూర్, అద్దాల తిమ్మాపూర్ తదితర గ్రామాల ప్రజలు ఈ రహదారి గుండా పయనిస్తుంటారు. రాత్రి సమయంలో వీటిని గమనించకుంటే పెద్ద ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు పట్టించుకొని వాటిని తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలతో పాటు పర్యాటకులు కోరుతున్నారు.



కుంటాలకు వెళ్లేదారిలో జారిపడిన రాళ్లు



రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నేరడిగొండ: మండలంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని వాగ్ధారి గ్రామానికి చెందిన యువకుడు జాదవ్ కృష్ణకాంత్ మండల కేంద్రంలో వారసంత (అంగడికి) ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. పోలీస్‌స్టేషన్ సమీపంలో రాంగ్‌రూట్‌లో వస్తున్న మహారాష్ట్రకు చెందిన కారు ఢీకొట్టింది. కారు ఆపకుండా వెళ్లిపోవడంతో పోలీసులు టోల్‌ప్లాజా దాటిన తర్వాత ఆ వాహనాన్ని పట్టుకున్నారు. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన క్షతగాత్రుడిని 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని అప్పగిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌రూరల్: సవార్ల పండుగను చూడడానికి వెళ్లిన ఓ బాలుడు తప్పిపోయి తిరిగి దొరికిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దస్నాపూర్ కాలనీలో శ్రీను, పద్మ దంపతుల కుమారుడు శనివారం మధ్యాహ్నం అదృశ్యమయ్యాడు. చుట్టుపక్కల వెతికినప్పటికీ దొరకపోగా తల్లి డయల్ 100 చేసి ఫిర్యాదు చేసింది. దీంతో బ్లూ కోట్స్ సిబ్బంది అరవింద్, మహేష్‌రెడ్డి ఆ బాలుడిని పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై వంగ విష్ణువర్ధన్ తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



షౌకత్ మృతదేహం

గుడిహత్నూర్: మండలంలోని డోంగర్‌గావ్‌కు చెందిన శేక్ షౌకత్ (55) అనారోగ్య కారణాలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని డోంగర్‌గావ్ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... షౌకత్ గత కొన్ని రోజులుగా మధుమేహ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో కాలికి గాయమైంది. డాక్టర్లు ఒక వేలును తీసి వేశారు. దీంతో తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యాడు. ఈ క్రమంలో తాగుడుకు బానిసయ్యాడు. గాయం మానక పోగా కాలును సైతం తీసి వేయాల్సి ఉంటుందని డాక్టర్లు తెలుపడంతో మరింత మానసిక ఒత్తిడికి గురయ్యాడు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులు పీరీల పండుగకు వెళ్లడంతో ఒంటరిగా ఉన్న షౌకత్ ఇంట్లో ఉరేసుకున్నాడు. పక్కనే ఉన్న బంధువులు పలకరించడానికి ఇంటికి రాగా తలుపులు మూసి ఉండడంతో కిటికిలోంచి చూడగా షౌకత్ దూలానికి వేలాడుతూ కనిపించాడు. తలుపులు పగలకొట్టి వెంటనే రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడికి భార్య జాకియా, ఆరుగురు సంతానం ఉన్నారు. వీరిలో నలుగురికి పెళ్లిళ్లు కాగా కుమారుడు కూతురు ఇంటి వద్ద ఉంటున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.